క్లుప్తంగా

ముసలమ్మ వారికి వెండి వస్తువుల సమర్పణ



వెండి వస్తువుల అలంకరణలో పుంతలో ముసలమ్మ

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు పుంతలో ముసలమ్మ వారికి ఆ ఆలయ కమిటీ నిర్వాహకులు వెండి మకరతోరణం, కిరీటాన్ని సోమవారం సమర్పించారు. వెండి వస్తువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మంగళవారం అమ్మవారి జాతర, బుధవారం తీర్థం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముమ్మిడివరం: కాకినాడ జగన్నాథపురంకు చెందిన పెంటబోయిన వీరబాబు ఆదివారం రాత్రి తన అత్తవారింటికి మోటారు సైకిల్‌పై వెళుతుండగా అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద అదుపు తప్పి రైలింగ్‌ను ఢీకొని పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన వీరబాబును హైవే మొబైల్ పోలీసులు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు.

కేశనపల్లి సీసీఎఫ్ సొసైటీ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

మలికిపురం: మండలంలోని కేశనపల్లి సీసీఎఫ్ సొసైటీ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఎన్నికల అధికారి బాబూ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా తాడి ఆనందరావు, ఉపాధ్యక్షుడిగా దేవ రాందాసు, డైరెక్టర్లుగా ఓగూరి పెద్దిరాజు, యడ్ల వెంకటేశ్వరరావు, యడ్ల వెంకటరమణ, కానూరి తాతారావు, తాడి రామకృష్ణారావు, రాపాక కిరణ్‌బాబు, కోరుకొండ రాజు, యడ్ల ప్రసాద్‌బాబు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సొసైటీ సభ్యులు అభినందించారు.

ఇంటి పట్టా ఇప్పించండి

అంబాజీపేట: ఇంటి స్థలానికి పట్టా ఇప్పించాలని నందంపూడికి చెందిన ఓ మహిళ స్పందనలో దరఖాస్తు చేసుకుంది. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ స్పందనలో కేవలం ఒకే దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, తహసీల్దార్ టి.మంగతాయారులు తెలిపారు. స్పందనలో మండలంలోని అధికారులంతా పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర



మామిడికుదురులో నూకాలమ్మ పూజాఘటంతో భక్తులు

మామిడికుదురు: గ్రామదేవత నూకాలమ్మ జాతర ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. చిత్ర విచిత్ర వేషధారణలో బాణసంచా కాల్పుల నడుమ జాతర కనుల పండువగా జరిగింది. ఆరు రోజుల పాటు జరిగే అమ్మవారి జాతరలో భాగంగా భక్తులు సోమవారం అమ్మవారికి నైవేద్యాలు, ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు చెల్లించారు. 24వ తేదీ శుక్రవారం అమ్మవారి తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. అదే రోజు ఆలయం వద్ద మహా అన్నసంతర్పణ ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

పాఠశాలకు సామగ్రి అందజేత



దాత అందించిన బీరువాను ప్రారంభించిన ఎంఈఓ విజయశ్రీ

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామానికి చెందిన ఎన్నారై చొప్పల రాజశేఖర్ స్థానిక పాఠశాలకు రూ.30 వేలు విలువైన వస్తువులను అందజేశారు. సోమవారం పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు అందజేశారు. ఐరన్ బీరువాతో పాటు కుర్చీలు, హాట్ అండ్ కూల్ వాటర్ డిస్పెన్సర్, ప్లేట్లు, గ్లాసులను ఎంఈవో విజయశ్రీకి అందజేశారు. ఆమె మాట్లాడుతూ దాత సేవలను అభినందించారు. దాత రాజశేఖర్‌ను వేదికపై సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వైవీ పద్మనాభం, సొసైటీ అధ్యక్షుడు చొప్పల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంచన్‌గా రండి.. లేకుంటే దరువేనండి

- పాఠశాలకు రాకుంటే ఇంటికి మెసేజ్
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుపై నిరంతర పర్యవేక్షణ
- ప్రభుత్వ చర్యలతో తల్లిదండ్రుల హర్షం



గంగలకుర్రులో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఉపాధ్యాయురాలు

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హాజరు పెంచేలా ప్రభుత్వం తాజాగా అమలు చేసిన మొబైల్ అలర్ట్ సందేశం విధానానికి మంచి స్పందన లభిస్తోంది. ‘నాడు–నేడు’తో ఇప్పటికే ప్రభుత్వ బడులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించి బైజూస్ కంటెంట్‌తో బోధన ప్రారంభించింది. తాజాగా విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు వస్తున్నారా? లేదా అన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే తల్లిదండ్రుల మొబైల్‌కు సందేశం పంపేలా చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ అలర్ట్ సందేశంతో తల్లిదండ్రులు పిల్లలను గాడిలో పెడుతున్నారు. పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో 111 జెడ్పీ హైస్కూళ్లల్లో 6 నుంచి పదో తరగతి వరకు 38 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరూ వంద శాతం హాజరై తద్వారా అమ్మఒడి పథకాన్ని అందుకోవాలన్న ఉద్దేశంతో ఈ విధానానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. కొన్ని సందర్భాల్లో విద్యార్థులు, పిల్లలు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి దుమ్మా కొడుతుంటారు. ఇలాంటి సందర్భంలో విద్యార్థి పాఠశాలకు హాజరు కాలేదంటూ వారి తల్లిదండ్రుల మొబైల్‌కు సందేశం వెళుతుంది. ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన ఈ విధానంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమయం దాటినా రాకుంటే ..

విద్యార్థులు ఉదయం 9 గంటల్లోపు పాఠశాలకు హాజరు కాకపోతే మీ అమ్మాయి, అబ్బాయి ఈ రోజు పాఠశాలకు హాజరు కాలేదంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేరుతో ఆయా తల్లిదండ్రులకు నేరుగా మొబైల్ సందేశం చేరుతుంది. దీని కోసం ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ సేకరించి సీఎస్ ఈ వెబ్సైట్లో పొందుపరిచారు. వరుసగా మూడు రోజుల పాటు పాఠశాలకు హాజరు కాకపోతే తల్లిదండ్రులతో పాటు ఆ ప్రాంత వలంటీర్, సచివాలయ వెల్ఫేర్ సహాయకుడికి ఈ మెసేజ్ చేరుతుంది. దీంతో వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్ హెచ్‌ఎంతో కలసి విద్యార్థి ఇంటికెళ్లి పాఠశాలకు ఎందుకు రావడం లేదన్న విషయాన్ని అడిగి తెలుసుకుంటారు. ఇలా రూపొందించిన ఈ పథకం సత్ఫలితాలను ఇస్తోంది. విద్యారంగంపై ప్రభుత్వ శ్రద్ధ వహిస్తోందనేందుకు ఇదే నిదర్శనమని తల్లిదండ్రులు చెబుతున్నారు.

హాజరు శాతం మరింత మెరుగు



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఆన్‌లైన్ అటెండెన్స్ అమలు చేస్తోంది. ఇప్పుడు విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే తల్లిదండ్రులకు సందేశం వెళ్లే కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. దీనివల్ల హాజరు శాతం మెరుగవుతోంది. విద్యార్థులు పాఠశాలకు ఎందుకు రాలేదో వెంటనే తెలుస్తోంది.

– బి.హనుమంతరావు, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ కార్యదర్శి, అంబాజీపేట

ఈ విధానంతో ఎంతో మేలు



విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకపోతే వారి తల్లిదండ్రుల ఫోన్‌కు సమాచారం చేరవేసే విధానం ఎంతో మంచిది. దీని వల్ల పాఠశాలలో వంద శాతం హాజరు అమలవుతుంది. బాలికల విషయంలో ఈ విధానం ఎంతో ఉపయోగకరం. విద్యార్థుల విద్యపై శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం ఏర్పడింది.

– అంబటి శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్,కె.పెదపూడి

నిత్యాన్నదానానికి భక్తుల విరాళాలు



దాతకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు సమర్పించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రావులపాలెంకు చెందిన కె.సూర్రెడ్డి, స్వాతి రూ.10,116, కె.వెంకట రామకృష్ణారెడ్డి, లక్ష్మి రూ.10,120 విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మామిడికుదురులో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

మామిడికుదురు: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ విజయ థామస్ అన్నారు. మామిడికుదురులో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఆధార్ కేంద్రం వద్ద పేరు మార్పులు చేర్పులు, చిరునామాలు మార్చుకోవచ్చన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు ఆయన వెంట ఉన్నారు.

అధ్వానంగా రహదారి



మామిడికుదురులో అధ్వానంగా ఉన్న రహదారి

మామిడికుదురు: మామిడికుదురు నుంచి కొర్లకుంట మీదుగా అప్పనపల్లి వెళ్లే రహదారి భారీ వర్షానికి అధ్వానంగా తయారయింది మెటల్ రోడ్డుపై వేసిన ఎర్ర కంకర చిత్తడిగా మారటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొన్న సంక్రాంతి తీర్థానికి రూ.లక్షలు పెట్టి తూతూ మంత్రంగా ఎర్ర బూడిద వేయడంతో ఈ వర్షానికి నానా ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరుచుకుని తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు

మామిడికుదురు: ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కుళాయిలను ఏర్పాటు చేశామని సర్పంచ్ అడబాల రామ్ సత్యనారాయణ (తాతకాపు) అన్నారు. లూటుకుర్రులో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీటిపై అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ లూటుకుర్రును హర్‌ఘర్ జల్ పంచాయతీగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. జలజీవన్ మిషన్‌లో వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్‌లు, కుళాయిలు పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులు త్వరలో పూర్తి చేసి వెంటనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీ, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ అరుణ్‌కుమార్, రమణ, నియోజకవర్గ టీం లీడర్ బి.చందు, బి.రమణ, జి.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ హసీనా

రావులపాలెం: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని ఊబలంక పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ హసీనా అన్నారు. ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని మెర్లపాలెం హైస్కూల్‌లో క్షయ వ్యాధిపై పాఠశాల పిల్లలందరికీ, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించినట్టు డాక్టర్ హసీనా తెలిపారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వ్యక్తికి ఆకలి మందగించడం, రెండు వారాలకు మించి దగ్గు, తెమడ పడడం, జ్వరం, బరువు తగ్గి శుష్కించిపోవడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఊబలంక ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ఖరీదైన మందులు ఉచితంగా ఇవ్వడంతో పాటు చికిత్స అందిస్తామన్నారు. అలాగే వారికి పోషకాహారం నిమిత్తం నెలకు రూ.500 అందజేస్తామన్నారు. క్షయ వ్యాధి రాకుండా పాఠశాల పిల్లలు, ప్రజలందరూ అవగాహన కలిగి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు ఎంఎస్‌ఎస్ సాయిరాం, పీడీడీ బిషప్, సూపర్‌వైజర్ రెడ్డి, ఏఎన్‌ఎంలు విజయలక్ష్మి, రత్నకుమారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఫీవర్ సర్వే



పెనికేరులో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య, ఆశ సిబ్బంది

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అకారణంగా సంభవిస్తున్న జ్వరాలు, అనారోగ్య సమస్యలపై సర్వే చురుగ్గా జరుగుతుంది. కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత ఆదేశాల మేరకు వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు తదితరులు ఆరోగ్య, ఆశ సిబ్బంది చేత ఈ సర్వేను చేయించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు. జ్వరపీడితులకు రక్త పరీక్షలు నిర్వహించి సత్వరమే ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. అలాగే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి ఉపయోగించు విధానాన్ని తెలియజేస్తున్నారు. సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా వైద్యారోగ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని అదనపు జిల్లా వైద్యాధికారి సుమలత పేర్కొన్నారు. హెచ్‌వీలు పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

గరగ నృత్య కళాకారుడు ‘చింతా’కు సన్మానం



మామిడికుదురులో వీరాంజనేయులను సన్మానిస్తున్న శ్రీనివాస్, గ్రామస్తులు

మామిడికుదురు: స్థానిక నూకాలమ్మ జాతర సందర్భంగా గ్రామానికి చెందిన పూజ గరగ నృత్య కళాకారుడు చింతా వీరాంజనేయులును కోనసీమ వృత్తి కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ సోమవారం ఘనంగా సత్కరించారు. వీరాంజనేయులు నూకాలమ్మ వారికి వంశ పారపర్యం పూజారిగా, పూజ గరగ నృత్యంలో ప్రతిభ కనబరిచారన్నారు. రిపబ్లిక్ డే పరేడ్ ఉత్సవాల్లో నాలుగు సార్లు పాల్గొని ప్రధాని, రాష్ట్రపతి విందులో పాల్గొని అవార్డులు అందుకోవడం గ్రామానికి గర్వకారణమన్నారు. అనంతరం స్థానికులు ఇంటి బాలాజీ వీరాంజనేయులుకు ప్రశంసా పత్రం, మెమెంటోతో పాటు రూ.3 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఇంటి గణపతిరావు, నయినాల అబద్దం, సక్కా త్రిలోచనరావు, ఉంద్రు శ్రీరామారావు, కందాల వెంకటేశ్వరరావు, నయినాల బాబులు, అప్పారి వెంకటేశ్వరరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలసిన మోహన్ తనయుడు



సీఎం జగన్‌ను కలిసిన శిరీష్, శ్రీలక్ష్మీమంగాదేవి

అయినవిల్లి: వెలగపూడిలోని అసెంబ్లీ లాబీ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దివంగత మిండగుదిటి మోహనరావు తనయుడు, పార్టీ కోనసీమ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి వెంకటసాయి శిరీష్ నారాయణస్వామి, మోహనరావు భార్య శ్రీలక్ష్మీమంగాదేవి సోమవారం కలిశారు. బడ్జెట్‌లో మన బడికి రూ.3500 కోట్లు, అమ్మఒడికి రూ.6500 కోట్లు, విద్యాదీవెనకు రూ.560 కోట్లు కేటాయించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు



అసెంబ్లీ ఆవరణలో సీఎం జగన్‌కు కలసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: నాలుగు లంక గ్రామాల ప్రజల కష్టాలను తీర్చుతూ ఊడిమూడిలంక వంతెన నిర్మాణానికి అన్ని అనుమతులు మంజూరు చేయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో సోమవారం జగన్‌ను చిట్టిబాబు కలసి పుష్పగుచ్ఛం అందించారు. వరదల సమయాల్లో ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల తరబడి ఉన్న వంతెన సమస్యను సీఎం జగన్ పరిష్కరించారు. దీంతో నియోజకవర్గ ప్రజల తరఫున చిట్టిబాబు జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా, వాటిని కూడా పరిష్కరిస్తామని జగన్ హామీ ఇచ్చారని చిట్టిబాబు ఫోన్‌లో విలేకరులకు తెలిపారు.

నేడు మండల పరిషత్ సమావేశం

అంబాజీపేట: మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు హాజరు కావాలని కోరారు. అలాగే మండలంలోని అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



చింతలూరులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవంలో నిర్వహిస్తున్న పారిశుధ్య, తాగునీటి కల్పన, ఆహార నాణ్యతా ప్రమాణాలను ప్రత్యేక అధికారుల బృందం పరిశీలించింది. వైద్యాధికారులు పి.భవానీ శంకర్, కె.శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం.పోశమ్మ, సూపర్‌వైజర్లు రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ పీఆర్‌సీ రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి నేతృత్వంతో సిబ్బంది తీర్థంలో పర్యటించారు. తీర్థంలో నెలకొన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి బయటకు తరలించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

తీర్థంలో ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ



చింతలూరులో తీర్థంలో మిరుమిట్లు గొలుపుతున్న విద్యుద్దీపాలంకరణ

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. మహిళలు తమ చిన్నారులతో కాగడాలు వెలిగించి బాలరిష్టాలను నివారించి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన వారకల్లు, తుళ్లబిళ్లను తల్లిదండ్రులు తమ చిన్నారులతో స్వీకరింపజేశారు. వర్షంలో ఇబ్బందులు ఎదురైనా సుదూర, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తాకిడికి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆర్‌డబ్ల్యూఎస్, దేవదాయశాఖ శాఖలు నీరు, చంటి పిల్లలకు ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి పాలు అందించారు. పంచాయతీరాజ్ శాఖ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటి చెత్తను అప్పుడు బయటకు తరలిస్తున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ పంపిణీలో సమస్యలు తలెత్తకుండా నిరంతరాయంగా సరఫరా చేశారు. పెదపళ్ల పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యసేవలను అందించారు. చిన్నారులకు, యువతకు వినోదాన్ని పంచే జెయింట్‌వీల్స్, కొలంబస్, రంగులరాట్నం తదితర వినోద సాధనాలను తీర్థంలో నెలకొల్పడంతో సందడి నెలకొంది. అమ్మవారి జాతర సందర్భంగా చర్మ వాయిద్య కళాకారులు శబ్దాలకు అనుగుణంగా ఆలయ అర్చకులు చేపట్టిన గరగ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాండు సన్నాయి వాయిద్య మేళాలు, విచిత్ర వేషధారణలు, కోయ నృత్యాలు, శక్తి వేషధారణ విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రావులపాలెం సీఐ ఎస్.రజనీ కుమార్, ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక పహారా నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవదాయశాఖ ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అకాల వర్షాల వల్ల భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. దుకాణాల సముదాయం చిత్తడిగా మారడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాఠశాలకు సరస్వతీ దేవి విగ్రహం బహూకరణ



సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

పి.గన్నవరం: మానేపల్లి జెడ్పీ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి జాస్తి పద్మావతి సోమవారం తన భర్త రాధాకృష్ణ జ్ఞాపకార్థం సరస్వతీ దేవి విగ్రహాన్ని బహూకరించారు. ఈ విగ్రహాన్ని సర్పంచ్ పితాని చంద్రకళ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు పితాని నర్సింహారావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు కుడుపూడి రవీంద్రనాథ్, యల్లమెల్లి స్వాతి కుమారి, హెచ్‌ఎం కేవీ సూర్యనారాయణ మూర్తి, రాధ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగ చైతన్యయాత్రకు శ్రీకారం

రాజోలు: మాదిగ సామాజికవర్గాన్ని రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో ప్రాధాన్యత కల్పించేందుకు మాదిగ చైతన్య యాత్రకు శ్రీకారం చుట్టామని ఎమ్మార్పీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ అన్నారు. సోమవారం రాజోలు, ములికిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి ఎమ్మార్పీఎస్ఎస్ ఆధ్వర్యంలో యువకులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మాదిగ చైతన్య యాత్ర నిర్వహించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ నెల 24న రాజోలు మండలం ములికిపల్లిలో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని కోరారు. ఈతకోట హేమసుందర్‌రాజు, తవిటికి రాజు, ముసూకడి రత్నకుమార్, దుర్గాప్రసాద్, యెలుమర్తి సురేష్, బలరామ్, ఉల్లంపర్తి జానీ తదితరులు పాల్గొన్నారు.

సహజయోగాతో మానసిక ప్రశాంతత



రాజోలు మాతాజీ ధ్యాన మందిరంలో సహజయోగా శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాజోలు: సహజ యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజ యోగా ధ్యాన మందిరం సహజ యోగులు వివరించారు. సోమవారం మాతాజీ నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని సహజ యోగా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. సహజ యోగా చేసే విధానం వివరించారు. సహజయోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు శారీరక రుగ్మతలు దూరమవుతాయన్నారు. డీఎస్ రావు, బోళ్ల పద్మావతి, యాళ్ల రవి, జి.కిశోర్, ఆకుల భాస్కరరావు, బోళ్ల వీరభద్రం, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయినవిల్లి: మండలంలోని మాగాం, సిరిపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి వెంబడి విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులు జరుగుతున్నాయని అమలాపురం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పనుల్లో భాగంగా అయినవిల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్ కె.జగన్నాథపురం ఫీడర్, ముమ్మిడివరం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఆర్‌డబ్ల్యూ ఫీడర్ పరిధిలోని మాగాం, కె.జగన్నాథపురం, క్రాప, పోతుకుర్రు గ్రామాలకు మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

రేకులు తీసుకెళ్లేందుకు బహిరంగ వేలం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలోని వినాయక సదన్ భవనం పైకప్పు రేకులను తొలగించి తీసుకెళ్లేందుకు సోమవారం ఆలయ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో 14 మంది దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. కాకినాడకు చెందిన దవులూరి వీరాస్వామి రూ.55 వేలు హెచ్చుపాట పాడి ఈ రేకులను దక్కించుకున్నారు.